ఎండాడ చెరువుకు మహర్దశ

- రూపురేఖలు మారనున్న ట్యాంక్‌బండ్
- రూ.43 లక్షలతో అభివృద్ధికి ప్రణాళికలు


నాడు వ్యర్థాలతో నిండిన ఎండాడ చెరువు


చెరువులోని వ్యర్థాలు తొలగిస్తున్న పొక్లెయిన్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఎండాడ చెరువు (ఎండాడ ట్యాంక్‌బండ్) మహర్దశ పట్టనుంది. వివిధ అభివృద్ధి పనులతో దీని రూపురేఖలు మారనున్నాయి. చెరువు నిండా మురుగు నీరు, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతున్న చెరువును అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే చెరువులో ఉన్న మురుగు నీరును తొలగించి పూర్తి స్థాయిలో వ్యర్థాలు తీసేశారు. 2.8 ఎకరాల విస్తీర్ణం గల ఈ చెరువును రూ. 43 లక్షలతో అభివృద్ధి చేసేందుకు అంచనాలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గేటు అమర్చనున్నారు. వివిధ రకాల పెయింటింగ్స్‌తో సుందరంగా తీర్చిదిద్ది వర్షపు నీరు, వాడుక నీటిని ఇక్కడ ఉన్న కల్వర్టు ద్వారా మళ్లించనున్నారు.

ల్యాండ్‌మార్క్‌లా అభివృద్ధికి చర్యలు

ప్రస్తుతం చెరువు చుట్టూ ఉన్న 125 విద్యుత్ దీపాల్లో 45 మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన దీపాలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురానున్నారు. ఇప్పటికే చెరువు చుట్టూ అద్భుతమైన వాకింగ్ ట్రాక్, జిమ్ పార్క్ ఉండడంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో సీనియర్ సిటిజన్లు, వాకర్స్ ఇక్కడకు వస్తున్నారు. అయితే ఈ ట్యాంక్‌బండ్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే ఎండాడకు ఒక ల్యాండ్ మార్క్‌గా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వాకింగ్ చేసేప్పుడు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇది వేల మందికి ఇబ్బందిగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండాడ చెరువును ప్రభుత్వం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని వాకర్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అనంతుని ఆలయ పునర్నిర్మాణానికి కొలతలు

పద్మనాభం: పద్మనాభంలో గిరిపై వెలసిన అనంత పద్మనాభుని ఆలయ పునర్నిర్మాణానికి దేవదాయ శాఖ ఇంజినీరింగ్ సిబ్బంది బుధవారం కొలతలు తీశారు. గతంలో ఆలయంపై పిడుగుపడడంతో శిఖరం శిథిలమైంది. ఈ నేపథ్యంలో ఆలయ పునర్నిర్మాణానికి కామన్ గుడ్ ఫండ్ నుంచి రూ.60 లక్షలు మంజూరు చేశారు. వీటిలో రూ.10 లక్షలు భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకుని సింహాచలం దేవస్థానంతో మ్యాచింగ్ గ్రాంటు మంజూరు చేయించారు. మిగతా రూ.50 లక్షలు కామన్ గుడ్ ఫండ్ కింద మంజూరు చేశారు. మొత్తం రూ.60 లక్షలతో ఆలయాన్ని పునర్నిర్మించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా దేవదాయ శాఖ ఏఈ శివ ప్రసాద్, అసిస్టెంట్ స్థపతి స్వాతి మీనాక్షి ఆలయం లోపల, వెలుపల భాగం కొలతలు తీశారు.


అనంతుని ఆలయ పునర్నిర్మాణానికి కొలతలు తీస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది

పబ్లిక్ డిమాండ్

కాళ్ల కింద కేబుల్ వైర్లతో అవస్థలు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్‌లో పలుచోట్ల రోడ్లపై కేబుల్ వైర్లు కట్టలు కట్టలుగా, చిందర వందరగా పడి కాళ్లకు తగిలి చిక్కుకుంటున్నాయి. దీంతో పాదచారులు, వృద్ధులు, చిన్నారులు కింద పడి గాయపడుతున్నారు. టౌన్ ప్లానింగ్, శానిటేషన్, సచివాలయ సిబ్బంది పట్టించుకోకపోవడంతో రోజుల తరబడి రోడ్లపై అడ్డంగా వైర్లు ఉంటున్నాయి. తక్షణమే వీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఎం.జగన్నాథరావు, పీఎం పాలెం.


పీఎం పాలెం మెయిన్‌రోడ్డు 2వ బస్టాప్ వద్ద రోడ్డుపై కేబుల్ వైర్లు

క్లుప్తంగా

బీమా తక్షణ సాయం అందజేత


బీమా తక్షణ సాయం అందజేస్తున్న అధికారులు

ఆనందపురం: మండలంలోని వేములవలసలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు బుధవారం తక్షణ బీమా సాయాన్ని అందజేశారు. నిడిగట్టు సరస్వతి అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరైంది. ఈ మేరకు తక్షణ సాయం కింద రూ.10 వేలు ఆమె భర్త నిడిగట్టు అప్పారావుకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింగరావు, ఎంపీటీసీ సభ్యుడు కోరాడ రాంబాబు, కన్వీనర్ పతివాడ గోపి, నారాయణప్పడు తదితరులు పాల్గొన్నారు.

గంటం దొరకు ఘన నివాళి


గంటం దొర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నబాబు, సిబ్బంది

కొమ్మాది: స్వాతంత్య్ర సమరంలో కీలక పాత్ర పోషించిన గంటం దొర 100వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ భవన్‌లో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శిక్షణ భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్నబాబు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజుతో కలిసి స్వాతంత్య్ర ఉద్యమంలో గంటం దొర పాల్గొన్నారని, అటువంటి మహనీయులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పైడితల్లమ్మ ఉత్సవాలు

పద్మనాభం: మండలంలోని కోరాడలో మూడు రోజుల నుంచి జరుగుతున్న పైడితల్లమ్మ ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. మంగళవారం రాత్రి గ్రామంలో మూడు రథాలను ఊరేగించారు. వీటిని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

15 మందికి ఉద్యోగాలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల యాక్స్ డిగ్రీ కళాశాల (అంబేడ్కర్ కాలేజీ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) ఆవరణలో బుధవారం జయభేరి ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ రాజారావు తెలిపారు.

బాలలకు పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఏఎస్‌జే ప్రతినిధులు

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులోని సేవానగర్‌లో స్థానిక నిరుపేద పిల్లలకు బుధవారం ఏఎస్‌జే సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి కె.శివరామరాజు మాట్లాడుతూ ఏఎస్‌జే తరఫున అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ముఖ్యంగా బాలల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశం 10న

మద్దిలపాలెం: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశాన్ని ఈ నెల 10న డాక్టర్ బుల్లయ్య కళాశాలలో నిర్వహిస్తున్నామని నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో గల గాంధీ సెంటర్ ఆవరణలో సాయంత్రం 5 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఆచార్య ఎ.డి.పాల్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

వ్యాపారుల ఆక్రమణలతో కుచించుకుపోతున్న రోడ్లు

కీలక కూడళ్లలో దుకాణాలతో రాకపోకలకు తీవ్ర అవస్థలు


ప్రమాదకరంగా విశాఖపట్నం కో ఆపరేటివ్ సహకార బ్యాంకు కూడలి

తగరపువలస: భీమిలి రోడ్డులోని గణేష్ థియేటర్, విశాఖపట్నం కో ఆపరేటివ్ సహకార బ్యాంకుల కూడళ్లు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటున్నాయి. ఈ కూడళ్లలో రోడ్లు దాటాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు. అలాంటి రద్దీగా ఉండే కూడళ్లకు నాలుగు వైపులా పోటీగా కొత్త దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. ఈ పోటీ కారణంగా కూడళ్లు మరింత ఇరుకుగా తయారవుతున్నాయి. అర్ధరాత్రి వేళ కొందరు జేసీబీలు, క్రేన్‌లతో తీసుకొచ్చి మరీ రెడీమేడ్ దుకాణాలు పెట్టేస్తున్నారు. ఒక్కొక్కరు ఒకటి కంటే ఎక్కువ దుకాణాలు కూడా పెడుతున్నారు. ఇలాంటి కొత్త వ్యాపారాలు జీరుపేట, చిల్లపేట గ్రామాలను ఆనుకుని కూడా ఉన్నాయి. వీటి తొలగింపు టౌన్ ప్లానింగ్ సిబ్బందికి కత్తిమీద సాములా తయారవుతోంది. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం అన్నట్టు రోడ్ల వెంట వ్యాపారాలు పెట్టుకునే వారి వెనుక వివిధ పార్టీల రాజకీయ నాయకులు ఉంటుండడంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. మాది తొలగిస్తే వారిదీ తొలగించాలని కొందరు అడ్డంగా వాదిస్తుండటంతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఎటూ చెప్పలేకపోతున్నారు. దీంతో గణేష్ థియేటర్ కూడలి నుంచి విశాఖపట్నం కో ఆపరేటివ్ సహకార బ్యాంకు దాటిన వరకు ఎదురుగా ఉన్న రహదారి ఒక్కోసారి కనిపించనంతగా దుకాణాలులు, వినియోగదారులతో నిండిపోతున్నాయి. దీంతో తరచూ ఈ మార్గంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఈ మార్గంలో చాలా వరకు నివాసాల కోసం నిర్మించిన భవనాలలో వ్యాపారాలు నిర్వహిస్తూ జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారు. అంతేకాకుండా 200 గజాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించిన భవనాలకు సెట్‌బ్యాక్‌లు వదలకపోవడంతో అగ్ని ప్రమాదాల సమయంలో అందులోని వ్యాపారులు నష్టపోతున్నారు. భవిష్యత్తులో మరిన్ని కొత్త దుకాణాలు రోడ్ల పక్కన ఏర్పాటు చేయకుండా నియంత్రించడంతోపాటు, రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని నిష్పక్షపాతంగా తొలగించాలని భీమిలి, తగరపువలస పట్టణ ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

ఆనందపురం: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం ఏర్పడుతుందని సబ్ స్టేషన్ ఏఈఈ ఎ.సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. లైన్లు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా పెద్దిపాలెం, పాడుగుపాలెం, చందక, గొట్టిపల్లి, కుసులువాడ, గొల్లలపాలెం, జగన్నాథపురం, వెంకటాపురం, బీపీ కళ్లాలు, పల్లిపేట, వేములవలస, ఆనందపురం, లొడగలవానిపాలెం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 02 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

కొమ్మాది: మారికవలస 11 కేవీ ఫీడర్ మరమ్మతులు, నిర్వహణ కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈఈ వై.సురేష్ కుమార్ తెలిపారు. దీనివల్ల మారికవలస, మారికవలస గ్రామం, టయోటా షోరూమ్, బోరవానిపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కాలనీ, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం, డంపింగ్ యార్డ్, చంద్రంపాలెం, దుర్గానగర్ 1, 2, కృష్ణానగర్, పోర్టుకాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పడకేసిన రక్షిత మంచినీటి పథకం

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీ బీసీ కాలనీలో దివీస్ సంస్థ ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం కొంత కాలంగా పని చేయడం లేదు. పథకం వినియోగానికి నిర్వాహకులు రూ.100 వంతున రీచార్జ్ కార్డులు గతంలో విక్రయించారు. ఒక్కసారి 20 లీటర్ల నీటిని పట్టుకునేందుకు కార్డు నుంచి రూ.5 వంతున కట్ అవుతుంది. కానీ మంచినీటి పథకం పనిచేయకపోవడంతో కార్డులు వృథాగా పడి ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా బంగ్లామెట్ట వాలు ప్రాంతం

తగరపువలస: భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట వాలు ప్రాంతంలో ఇళ్లు ప్రమాదం అంచున ఉన్నాయి. ఇటీవల వర్షాలకు వాలు ప్రాంతంలో గ్రావెల్, రాళ్లు సర్వీస్‌రోడ్డు పైకి జారిపడుతున్నాయి. దీంతో ఇక్కడ రక్షణ గోడ నిర్మించి ఇళ్లకు రక్షణ కల్పించడంతోపాటు సర్వీస్‌రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా రాళ్లు, గ్రావెల్ దొర్లకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. 1974లో వెంకటేశ్వరమెట్ట, బంగ్లామెట్టలను విడదీసి గోస్తనీ నది మీదుగా జాతీయ రహదారి నిర్మించారు. మూడేళ్ల క్రితం బంగ్లామెట్టపై జాతీయ రహదారి వైపు కొన్ని నిర్మాణాలను తొలగించారు. కొంతకాలంగా ఈ ఇరువైపులా మెట్టలపై పలువురు ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరువైపులా జాతీయ రహదారిని ఆనుకుని రక్షణగోడలు నిర్మిస్తే తప్ప మెట్టపై ఇళ్లకు రక్షణ ఉండదని భావిస్తున్నారు. వెంటనే వీటి రక్షణకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


బంగ్లామెట్టపై సర్వీస్‌రోడ్డు వైపు ప్రమాదం అంచున ఇళ్లు

హడలెత్తిస్తున్న కుక్కలు

తగరపువలస: భీమిలి జోన్‌లో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులుగా కనిపించి స్థానికుల పిక్కలు పట్టుకుంటున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిని వెంటాడుతున్నాయి. దీంతో స్థానికులే కాకుండా స్థానికేతరులు కూడా ఒంటరిగా రాకపోకలు సాగించలేకపోతున్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో కుక్కలను పట్టుకుని శస్త్రచికిత్సల తర్వాత ఎక్కడపడితే అక్కడ వదిలేయడం వల్లే భీమిలి జోన్‌లో కొత్త కుక్కలు కనిపిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. మరోవైపు స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో మాంసం, చేపల వ్యర్థాల కోసం గాలించే కుక్కలు తర్వాత ఊర్ల మీద పడుతున్నాయి. ఎవరొచ్చినా తమకు అడ్డం లేదన్నట్టు వీధుల్లో, రోడ్లపై తిష్ట వేస్తున్నాయి. రాత్రివేళ వీటి అరుపులు ఆందోళనకరంగా ఉండటంతో చాలామందికి కంటిమీద కునుకు లేకుండా పోతోంది. కర్రలు పట్టుకుని వెంట తరిమినా మళ్లీ అక్కడికే వచ్చి తిష్ట వేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వేరే ప్రదేశాల్లో కుక్కలను పట్టుకుని భీమిలి జోన్‌లో వదిలిపెట్టకుండా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


గ్రంథాలయ వీధిలో కుక్కల గుంపు

సాగర సంరక్షణ అందరి బాధ్యత

- నేడు ప్రపంచ సముద్ర దినోత్సవం

ఏయూ క్యాంపస్: మానవాళి మనుగడకు అవసరమైన ప్రాణవాయువును అధికంగా అందించే సముద్రాలను కాపాడుకుందాం అని కృష్ణ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం సమావేశ మందిరంలో బుధవారం ఉదయం నిర్వహించిన ప్రపంచ సముద్రాల పరిరక్షణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. 2050 నాటికి చేపలు, ఇతర జీవరాశి కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలే సముద్రాలలో అధికంగా ఉంటాయని ఒక సర్వేలో తేలిందన్నారు. ఇటువంటి సమయంలో సముద్రాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉందన్నారు. ఏయూ సైన్స్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ డీఈ బాబు మాట్లాడుతూ సముద్రాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. 50 శాతానికి పైగా ప్రాణవాయువును ఇచ్చే సముద్రాల పరిరక్షణ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు ఎస్. బాలప్రసాద్ మాట్లాడుతూ సముద్రాల పరిరక్షణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఏయూ పర్యావరణ శాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఈయూబీ రెడ్డి మాట్లాడుతూ సముద్రాలలోకి విష రసాయనాలు, విషపూరితమైన క్రిమిసంహారాలు, భార లోహాలు వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరనాథ్, జీవ వైవిధ్య మండలి రీజనల్ కోఆర్డినేటర్ జానకిరావు, సిఫా సంస్థ ప్రతినిధి డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య రామకృష్ణారావు తదితరులు

బయో ఇన్నోవేషన్ ప్రోగ్రాంకు విద్యార్థుల ఎంపిక

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆ హబ్, మేధో సంపత్తి విభాగం, ది సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ అప్లయిడ్ బయాలాజికల్ సైన్సెస్–ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(టీ క్యాబ్స్–ఇ) సంయుక్తంగా నిర్వహిస్తున్న బయో ఇన్నోవేషన్ ప్రోగ్రాం -2023కు విద్యార్థుల ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. వర్సిటీలోని పలు విభాగాలకు చెందిన విద్యార్థులను మౌఖిక పరీక్షల ద్వారా ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. వర్సిటీ విద్యార్థులు అలేఖ్యా అధికారి, నిఖిల్ చెన్ను, మహాలక్ష్మి వోలేటి, మోనాలిసా చౌదరి, మునీషా కుసుమే, పూర్ణిమ మల్లూరి, ప్రత్యూష సారపు, సునీత గంట ఎంపికయ్యారు. టి క్యాబ్స్ - ఇ వ్యవస్థాపకుడు డాక్టర్ రవికిరణ్ యేడిది, ఐపీఆర్ చైర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను అధికారులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో ఆచార్యులు

సామాజిక మాధ్యమాల భూమిక కీలకం

ఏయూ క్యాంపస్: మత సామరస్యం, ప్రపంచ శాంతిని పెంపొందించడంలో సామాజిక మాధ్యమాల భూమిక ఎంతో కీలకమని పీస్ మెసేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సిరాజ్ ఉర్ రెహమాన్ అన్నారు. సామాజిక మాధ్యమాలలో మత విద్వేషాలను ఎదుర్కోవడం అనే అంశంపై ఏయూ గాంధీ అధ్యయన కేంద్రం, సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఈ సందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ అసత్య ప్రచారం, ద్వేషాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య చల్లా రామకృష్ణ మాట్లాడుతూ దేశ సమగ్రాభివృద్ధికి ఐక్యతే సాధనంగా నిలుస్తుందన్నారు. వివిధ మతాల మధ్య ఉన్న సారూప్యతలను ప్రచారం చేయడం, మత సహనాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ సామాజిక మాధ్యమాలలో వస్తున్న నూతన విధానాలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కిషోర్, సుఫ్తీ నద్వీ, కె.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిరాజ్‌ను కేంద్రం తరఫున డాక్టర్ చల్ల రామకృష్ణ సత్కరించారు.

ఆహ్లాదం మాటున మృత్యువు..!

- గంభీరం రిజర్వాయర్ వద్ద పెరుగుతున్న ప్రమాదాలు
- ప్రాణాలు తీస్తున్న రిజర్వాయర్ ముందు ఊబి


గంభీరం రిజర్వాయర్


రిజర్వాయర్ ముందు భాగంలో నీటి మడుగు

ఆనందపురం: చుట్టూ ఎత్తైన కొండలు... వాటిపై పచ్చని తివాచీ పరిచినట్టు ఉండే చెట్లు... నిండు కుండలా నీటితో తొణికిసలాడే రిజర్వాయర్ గర్భం... ఇది ప్రకృతి రమణీయతకు అద్దంపట్టే గంభీరం రిజర్వాయర్ ప్రాంతం సోయగం. దీంతో ఇక్కడ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడానికి అధిక సంఖ్యలో నగరవాసులు, పర్యాటకులు, విద్యార్థులు వస్తుంటారు. రిజర్వాయర్‌లో తొణికిసలాడే నీటిని చూసి ఎంతో ఉత్సాహంతో ఈత కోసం దిగుతుంటారు. రిజర్వాయర్ ముందు భాగంలో చిన్న చెరువుని తలపించే అగాథం ఉంది. అందులోనూ జలకాలాడుతుంటారు. అయితే అక్కడే మృత్యువు కాచుకొని ఉంటుందని ఎవరూ ఊహించలేకపోతున్నారు. సరదాగా ఈతకు దిగిన వారు మృత్యువాత పడుతున్నారు.

ఈత కోసం దిగి.. ఊబిలో కూరుకుపోయి..

గంభీరం పరిసర ప్రాంతాల పొలాలకు సాగునీరు అందించడానికి, విశాఖ నగర ప్రజలకు తాగునీరు అందించడానికి 60 ఏళ్ల క్రితం గంభీరం వద్ద నాలుగు కొండల నడుమ రిజర్వాయర్ నిర్మించారు. అప్పట్లో ఈ ప్రాంతం శివారున ఉండడంతో ఎవరూ వెళ్లే వారు కాదు. విశాఖనగరం ఆనందపురం వరకు విస్తరించడం, గ్రామీణ ప్రాంతం కాస్తా పట్టణీకరణ సంతరించుకోవడంతో రిజర్వాయర్‌కు సందర్శకుల తాకిడి ఎక్కువయింది. ముఖ్యంగా వందలాది మంది విద్యార్థులు ఇక్కడకు చేరుకొని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. అంత వరకు బాగానే ఉంది. కానీ పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టలేక పోతున్నారు. మృత్యుకుహరంగా మారిన నీటి మడుగు రిజర్వాయర్ ముందు భాగంలో వరదనీటి ప్రవాహానికి చెరువు మాదిరిగా పెద్ద గొయ్యి ఏర్పడింది. అందులో ఏడాది అంతా స్వచ్ఛమైన నీరు ఉంటోంది. కాగా ఆ మడుగు అడుగు భాగంలో ఊబి ఉంది. చూడడానికి ఎంతో ఆహ్లాదకరంగా ఉండడంతో విద్యార్థులు ఈత కోసం అందులో దిగి ఊబిలోకి కూరుకుని మృతి చెందుతున్నారు. అలాగే రిజర్వాయర్ నీటిలోకి చాలా మంది ఈత కోసం దిగుతున్నారు. గతంలో రిజర్వాయర్ గర్భంలో గల గ్రావెల్‌ను తవ్వి తరలించుకుపోవడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ఊబిగా మారాయి. అది తెలియక అందులోకి ఈతకు దిగిన వారు చిక్కుకొని మృత్యువాత పడుతున్నారు. ఇలా ఏటా కనీసం ఇద్దరు, ముగ్గురు ఇక్కడ ప్రాణాలు కోల్పోతున్నారు. గడిచిన కొన్నేళ్లలో ఇలా పలువురు మృతి చెందారు.

కానరాని రక్షణ చర్యలు

రిజర్వాయర్ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ రక్షణ చర్యలు మాత్రం చేపట్టలేదు. ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపే హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ఇక్కడ నీటిని వాడుకుంటున్న జీవీఎంసీ అధికారులు అయినా కనీసం సెక్యూరిటీ గార్డులను నియమించకపోవడం శోచనీయమని స్థానికులు అంటున్నారు.

గార్డులను నియమించాలి



గంభీరం రిజర్వాయర్ వద్ద ప్రమాదాలు జరగడం పరిపాటి అయింది. అక్కడకు వచ్చే వారిని నిలువరించడానికి కనీస ఏర్పాట్లు లేవు. దీంతో కళాశాల విద్యార్థులు సరదాగా ఈత కోసం దిగి మృత్యువాత పడుతున్నారు. ఇక్కడ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులనైనా నియమిస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

– ఎరుకొండ అప్పలరాజు, కణమాం.

కంచె ఏర్పాటు చేయాలి



రిజర్వాయర్‌కు చేరుకోవడానికి ఎటువంటి అడ్డంకులూ లేవు. దీంతో అక్కడకు చాలా మంది నేరుగా చేరుతున్నారు. రిజర్వాయర్ ప్రవేశ ప్రాంతం వద్ద ప్రమాదకరంగా మారిన మడుగు వద్దకు ఎవరూ చేరుకోకుండా కంచె ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

-కొల్లాయి సూరిబాబు, వెల్లంకి గ్రామం.

ఈ వాహనం ఎవరిదో..?

తగరపువలస: జీవీఎంసీ 2వ వార్డు సంగివలస కాలనీని ఆనుకుని శ్రీబాసర లే అవుట్‌లో గత 10 రోజులుగా వ్యాన్ నిలిపి ఉంది. దీనికి సంబంధించిన వ్యక్తులు ఎవరూ రాకపోవడంతో పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఎవరూ ఈ వాహనం తమది కాదని అంటుండగా... ఎవరైనా దొంగలించి ఇక్కడ వదిలేశారేమోనని అనుమానిస్తున్నారు. భీమిలి పోలీసులు ఈ వాహనంపై దృష్టి సారించాలని లే అవుట్ వాసులు కోరుతున్నారు.


శ్రీబాసర లే అవుట్ శివారులో నిలిపి ఉంచిన వాహనం

యువకుడిపై దాడి

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీ చిననాగమయ్యపాలెంలో బుధవారం చెల్లపల్లి ఎల్లాజీ అనే యువకుడిపై అతని కుటుంబ సభ్యులు దాడికి పాల్పడ్డారు. మధ్యాహ్నం నుంచి ఇంట్లో ఉంచి తీవ్రంగా కొట్టడంతో స్థానికులు భీమిలి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు చిననాగమయ్యపాలెం చేరుకుని బాధితుడు ఎల్లాజీని ఆస్పత్రికి తరలించారు. అతనిపై దాడికి పాల్పడిన నలుగురు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ఎల్లాజీ చిననాగమయ్యపాలెంలో టిఫిన్ సెంటర్‌తోపాటు చిప్పాడ పంచాయతీ సిటీనగర్‌లో పానీపూరి, చాట్ విక్రయిస్తుంటాడు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. విశేషంగా హారతులు ఇచ్చారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం అందజేశారు.